తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
శనివారం
08 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :




ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 7 (జనం సాక్షి) 'మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి.. ఆకాశమంత పందిరిలో.. పంచభూతాల సాక్షిగా.. వందలాదిమంది బంధుమిత్రుల సమక్షంలో.. పెన వేసుకున్న వైవాహిక బంధాలు.. ఐదు నిమిషాల క్షణికానందం కోసం.. అక్రమ సంబంధాలను ఏర్పరచుకొని .. కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవడం ఇటీవల కాలంలో తీవ్ర చర్చానీయాంశం గా మారుతోంది... గత కొంతకాలం క్రితం వరకు ఈ వ్యవహారాల్లో భర్తలు వారి భార్యలను హింసించి, వేధించిన ఘటనలు ఉన్నాయి.. కానీ..! గత ఒకటీ రెండేండ్ల కాలాన్ని పరిశీలిస్తే సీన్ రివర్స్ అయ్యింది.. ప్రియుడు మోజులో పడి కట్టుకున్నోడిని కడతేరుస్తున్న వరుస సంఘటనలు సభ్య సమాజాన్ని ఆలోచనలో పడేస్తున్నాయి.. తాజాగా ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వెలుగు చూసిన ఓ వివాహిత అక్రమ సంబంధం తీరు ఆమె భర్తకు షాక్ ఇవ్వగా, స్థానిక పోలీసులను విస్తు పోయేలా చేసింది. బాధితుడు, పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

వార్తా 2వ పేజీలో



ఈ నెల 10 వ తేదీన విజయవిహార్‌కు

## సీఎం రేవంత్ రెడ్డి రాక..

### వరుణ యాగం స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ బి చంద్రశేఖర్

**నాగార్జునసాగర్ ఆగస్టు 7 (జనంసాక్షి)** నాగార్జునసాగర్ సమీపంలోని విజయవిహార్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ యాగశాలను సందర్శించి అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.

మిగతా 11లో

సేంద్రియ సాగుకు మునుగోడును

## చిరునామాగా మార్చాలి

### సేంద్రియ పంటలకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ కల్పిస్తాం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి

**చండూరు, ఆగస్టు 7 (జనంసాక్షి)** రసాయన ఎరువులు, పురుగు మందుల విచ్చలవిడి వినియోగంతో భూమి నిస్సారంగా మారుతోందని, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలంటే సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు



## కన్నేటి వెంకన్న సేవలు చిరస్మరణీయం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

### మంగళగూడెంలో విగ్రహావిష్కరణ.. ఘనంగా ద్వితీయ వర్ధంతి



**ఖమ్మం రూరల్, ఆగష్టు 07 (జనంసాక్షి):** ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని, అయితే చనిపోయిన తర్వాత కూడా సమాజం తలుచుకునేలా, ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా జీవించడమే అత్యున్నతమైన జీవితమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం

మిగతా 2లో

**నాంపల్లి, ఆగస్టు 7 (జనంసాక్షి)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతోంది. "రైతు సంక్షేమమే మా లక్ష్యం" అని ప్రభుత్వం చెబుతున్నా, నాంపల్లి మండలంలోని క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. విత్తనాల నుండి ధాన్యం అమ్మే వరకు ప్రతి అడుగులో రైతు అవస్థలు పడుతున్నాడు.

**ఎరువుల కొరత ప్రభుత్వ విధానాలతో అలిసిపోతున్న రైతు**

ఎరువుల పంపిణీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులు ఎత్తేసింది, ఏమి చేయాలో తెలియక కాలయాపన కొరకు,రైతులను ఇబ్బంది పెట్టడం కొరకు యాప్ అని పెట్టీ రైతులను ఇంకా ఇబ్బందికి గురిచేస్తుంది,అందరూ స్మార్ట్ ఫోన్ లు ఉన్నా రైతులు ఉంటారా...వృద్ధ రైతుల పరిస్థితి ఇంకా చెప్పాల్సిన పని లేదు,ఎరువుల కోసం ఎదురుచూపులు, చెప్పుల లైన్లు,ధర్నాలు,రాస్తారోకో లు ఆత్మహత్యలు అన్ని జరుగుతున్న రైతన్న మీద సవతి తల్లి ప్రేమని చూపిస్తుంది అని రైతు వీరమల్ల బిక్షం ప్రశ్నిస్తున్నారు.

మిగతా 9లో




జాతీయ చేనేత దినోత్సవం

### చేనేత వస్త్రాలు ధరించి రంగానికి చేయూతనివ్వాలి :కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, ఆగస్టు 7, (జనంసాక్షి):** స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించడం

మిగతా 9లో



# నా భర్తను చంపేయ్.. లేదంటే నేను చనిపోతా

మహబూబాబాద్ జిల్లా, దోర్నకల్ మండలం, చిలుకోడు గ్రామ నివాసి గాదె రాజేశ్వరరావుకు.. సూర్యాపేట జిల్లా మోతే మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఓ యువతితో గత 2016లో వివాహం జరిగింది. భార్యాభర్తలిద్దరూ ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయి ప్రభాత్ నగర్ లో ఒక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, భర్త రాజేశ్వరరావు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ హాస్పటల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే..! అతని భార్య కొరియర్ బోయ్ అయినటువంటి సైదులు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గత నెల 27న మధ్యాహ్నం భోజనానికి వచ్చిన భర్త తన భార్య మరొకరితో ప్రైవేట్ గా, సన్నిహితంగా ఉండడాన్ని ప్రత్యక్షంగా చూశాడు. ప్రవర్తనతో విసుగు చెందిన రాజేశ్వరరావు మరుసటి రోజే తన స్వగ్రామం చిలుకోడులో పంచాయతీ పెట్టించాడు. దానికి పక్క గ్రామమైన చిలుకోడు సంకీస లో నివాసం ఉంటున్న తన అన్న గాదె శ్రీనివాస్ ను తీసుకు వచ్చేందుకు వెళుతుండగా భార్య ప్రియుడు సైదులు అతనిని వెంబడించాడు. గమనించిన రాజేశ్వరరావు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. అనంతరం చిలుకోడులోని తన ఇంటికి వచ్చి భార్య సెల్ ఫోన్ పరిశీలించగా ఆమె ప్రియుడికి పంపించిన వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ మెసేజ్ లు చూసి అవాక్కయ్యాడు.

**నా భర్తను చంపేయ్..**

కష్టసుఖాల్లో నూ కలకాలం కలిసి కాపురం చేద్దామనుకున్న ఆ కుటుంబంలో అక్రమ సంబంధం చిచ్చు పెట్టింది. పంచభూతాల సాక్షిగా మూడు ముళ్ళు వేసిన భర్తను కాదని ఆ మహిళ తన ప్రియుడు పురిమెట్ల సైదులతో ఏర్పరచుకున్న వివాహేతర సంబంధం బయట పడడంతో కట్టుకున్న వాడిని ఖతం చేసేందుకు కుట్ర పన్నింది. ఎలాగైనా 'నా భర్తను చంపెయ్' .. లేదంటే 'నన్ను బతకనీయుడు' .. ' నేనే చనిపోతా' .. ' ఇంట్లో వద్దు.. బయట ఎక్కడైనా యాక్సిడెంట్ చేయించు'.. ' వాడిని యాక్సిడెంట్ చేస్తావా లేదా' ..? ' వాడు అంతా బయటికి వస్తుంది వెయిట్ చెయ్ అంటున్నాడు' .. ఇలా తన ఫోన్ లోని వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ ద్వారా ప్రియుడికి అనేక రకాల మెసేజ్ లు పంపించింది. ఇంకేముంది..! తన అక్రమ సంబంధం ప్రియురాలు కోరిన కోరికను తీర్చేందుకు సైదులు 'సై' అన్నాడు. ఆ మరుక్షణం నుంచి రాజేశ్వరరావు ఫాలో అవుతూ అవకాశం కోసం ఎదురు చూడ సాగాడు.

**పోలీసులను ఆశ్రయించిన భర్త**

పెళ్లి తంతులో ఏడు అడుగులు నడిచిన భార్య, కడవరకు కలిసి ఉంటానని ప్రతిజ్ఞ చేసిన సతి అక్రమ సంబంధం మోజులో తననే కడతేర్చేందుకు వేసిన పన్నాగం తెలుసుకుని అవాక్కైన భర్త రాజేశ్వరరావు "రక్షించండి మహాప్రభో ' అంటూ పోలీసులను ఆశ్రయించాడు. భార్య సెల్ ఫోన్లోని వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ మెసేజ్ లు చూసి బిత్తర పోయి ఈనెల 1వ తేదీన మహబూబాద్ జిల్లా దోర్నకల్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు. ముందస్తుగా తాను స్క్రీన్ షార్ట్స్ తీసి పెట్టుకున్న భార్య మెసేజ్ లను పోలీసులు ముందు ఉంచాడు. ఆమె నుండి తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించడంతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. అక్కడ జీరో ఎఫ్ ఐ ఆర్ చేసిన అధికారులు కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ కు బదలయించారు. అక్కడ నుండి వచ్చిన బాధితుడు రెండు రోజుల క్రితం (గురువారం) తన గోడును స్థానిక (ఖమ్మం రూరల్)సీఐ ముష్క రాజుకు వెల్లబోసుకొని మరో పిటిషన్ ఇచ్చాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా..! కట్టుకున్న వాడిని కాదని మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం.. అది బయటకి పొక్కడంతో తాళి కట్టిన భర్తనే కడతేర్చాలనే భార్య నిర్ణయం ఎంత మాత్రం సరైనది కాదని విషయం తెలిసిన ప్రతి ఒక్కరు వ్యాఖ్యానించడం గమనార్హం.



### ఎస్.ఎల్.బీసీ, డిండి ప్రాజెక్టులను

# వెంటనే పూర్తి చేయాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**చండూరు, ఆగస్టు 07 (జనంసాక్షి)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలే ప్రశ్నించి తిప్పికొట్టాలని సీపీఐ నల్గొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుండి 12 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ప్రజా చైతన్య బైక్ యాత్ర'ను శుక్రవారం చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలోని తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించి, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే సీపీఐ చేపట్టిన ఈ ప్రజా చైతన్య యాత్రల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.నల్గొండ జిల్లాకు జీవనాడిలా భావించే ఎస్ఎల్బీసీ, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు దశాబ్దాలుగా పెండింగ్లో ఉండడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితేనే జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సీజన్లో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టం పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లరాజు రామలింగయ్య, చండూరు మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు, బరిగెల వెంకటేష్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, సిహెచ్ ఉషయ్య, గంటా రమేష్, జెల్లా శ్రీను, ఇరిగి సంజీవ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జగన్, పాండురంగారావు, మాజీ జడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, బోయపల్లి జంగయ్య, బోయపల్లి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

### నెల్లిపాక సొసైటీ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ రైతు సంఘం

**అశ్వాపురం ఆగస్టు 7 (జనంసాక్షి):**



మల్లెలమడుగు: నెల్లిపాక సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి, దోషులుగా తేలిన వారి నుంచి నష్టపోయిన సొమ్మును వెంటనే రికవరీ చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.శుక్రవారం మల్లెలమడుగు గ్రామంలోని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు స్వర్ణం బాల నర్సయ్య నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లిపాక సొసైటీలో జరిగిన అవినీతి వ్యవహారంపై ప్రభుత్వం పారదర్శకంగా విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, సంఘంలో జరిగిన అవకతవకలపై అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులతో చర్చించి, అనంతరం జిల్లా కలెక్టర్ను కలిసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు బద్దం శంబిరెడ్డి, రైతు సంఘం నాయకులు గొడుగు వెంకన్న, స్వర్ణం వీరరాఘవులు, మల్లెలమడుగు సీపీఎం గ్రామ కార్యదర్శి దండి రాములు తదితరులు పాల్గొన్నారు.

# కన్నేటి వెంకన్న సేవలు చిరస్మరణీయం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

### మంగళగూడెంలో విగ్రహావిష్కరణ..

### ఘనంగా ద్వితీయ వర్ధంతి

మంగళగూడెం గ్రామంలో శుక్రవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ కన్నేటి వెంకన్న రెండో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకన్న విగ్రహాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు.

**-పదిమందికీ మేలు చేయడమే అసలైన సంపాదన : మంత్రి పొంగులేటి.**

"మానవ జన్మలో సంపాదించే ఆస్తిపాస్తుల కంటే, నలుగురికి చేసిన సాయం, సంపాదించుకున్న అభిమానమే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. కన్నేటి వెంకన్న తన జీవితాంతం ప్రజల కోసమే తపించారని కొనియాడారు. ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' నిలబడ్డారని, అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రూపం విగ్రహమై ఈ ఊరిలో నిలిచిందన్నారు. ఆయన చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ల చైర్మన్ రాయల నాగేశ్వరావు,రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, కొప్పుల చంద్రశేఖర్, వీరేల్లి అప్పారావు, కన్నేటి అనిల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కన్నేటి వెంకన్న కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలి

### ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్

**భద్రాచలం ఆగస్టు 07 (జనంసాక్షి)**



భద్రాచలంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఐటీడీఏ అధికారులతో పాటు వివిధ ఆదివాసీ సంఘాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, అధికారులతో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు, ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ ప్రకారము ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ఆదివాసి వంటకాలతో వారిని ఆనందింప చేసే విధంగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వచ్చే అతిధులకు మనమిచ్చే ఆతిథ్యంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సభ్యులకు సూచించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు వివిధ ఆదివాసి తెగల గిరిజనులతో ర్యాలీలు, మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై చాయి చిత్ర ప్రదర్శనశాలలో ఏర్పాటులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులతో పాటు ప్రజలకు ఆదివాసి వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులకు తెలిపారు. అలాగే వివిధ తెగల సాంప్రదాయానికి సంబంధించిన సాంస్కృతిక నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేయాలని అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో పనిచేయుచున్న యూనిట్ అధికారులు మీకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి చందన, గురుకులం ఆర్సీవో అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిఎంజిసిసి సమ్మయ్య, ఏపిఓ పవర్ వేణు, ఏసీఎంఓ రమేష్, డి ఈ విజయ్ కుమార్, ఏటీడీవో రాధమ్మ, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జీసిసి మేనేజర్ జయరాజ్ పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సెంటర్ లోని మన్యం వీరుల విగ్రహాలు, పాత మార్కెట్లో రాణి దుర్గావతి, కొమరం భీమ్ విగ్రహాలను ఆదివాసి సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ తెల్లం రమణయ్య, కో-కన్వీనర్ ముర్ల రమేష్, సభ్యులు కుంజా శ్రీను, కుంజా సంతోష్, కొర్స చినబాబు దొర పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలపై ఆరా : ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట ఆగస్టు 7 (జనంసాక్షి)**
యాదగిరిగుట్ట పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వయంగా పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాతగుట్ట రోడ్డు, బీసీ కాలనీ, నల్లచెరువు, అంగడి బజార్, బాలికల వసతి గృహం, పెద్దమోరి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విస్తృతంగా పర్యటించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ముందుగా నల్లచెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. పాతగుట్ట రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద ఉన్న గోడ సమస్య పరిష్కరించి అక్కడ నిర్మించిన సీసీ రోడ్డు పనులను, సమీపంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దమోరి ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. పట్టణంలో డ్రైనేజీ, రహదారులు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.

అనంతరం బీసీ కాలనీలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడ విద్యార్థులకు కుర్చీలు, ప్లేట్లు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత కొద్దిరోజుల క్రితం మంత్రివర్యులు కొండ సురేఖ విద్యార్థుల కోరిక మేరకు అడగగానే యాదగిరిగుట్ట ఆూఖ శ్రీనివాస్ నాయుడు గారు కుర్చీల కోసం సహకరించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి చదువు, వసతి, భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే అల్పాహారం చేశారు.



విద్యార్థుల కోసం స్వయంగా వడ్డించడం ద్వారా వారితో ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

**వలిగొండ, ఆగస్టు 7(జనంసాక్షి)**
భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు, కుంభం పౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకుడు బత్తిని నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డు పక్కన పెద్ద ఎత్తున కుంభం కీర్తి రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేకు కట్ కట్ చేశారు.అనంతరం ప్రజలకు పండ్లు ,బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ గౌడ్ మాట్లాడుతూ... యువ నాయకురాలు కీర్తి రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎల్లప్పుడు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలలో మంచి పేరు ఉండి దూసుకుపోతున్న కీర్తి రెడ్డి రాజకీయాలలో రాణించి ఉన్నత పదవులను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశంసత్తిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ గరిసె రవి ,వైస్ చైర్మన్ జంగారెడ్డి , ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్ ,నాయకులు పలుసం సతీష్ గౌడ్, కొండూరు భాస్కర్, గంగాపురం సతీష్ గౌడ్, సామ రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, గంగ దారి రాములు, బత్తిని లింగయ్య ,పబ్బు సురేందర్, కాసుల వెంకన్న,కొండూరు సాయి, ఎమ్మె లింగస్వామి, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభం సొంత నిధులతో గుర్రపు డెక్క ఆకుతొలగింపు



**వలిగొండ, ఆగస్టు 7 (జనం సాక్షి)**
భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వంతనిధులతో భీమ లింగం కాలువ వెంట గుర్రపు డెక్క ఆకును హిటాచి యంత్రం ద్వారా తొలగిస్తున్నారు. వలిగొండ చెరువు నుండి మొదలుకొని మల్లెపల్లి, వెలవర్తి ,మొగిలిపాక మీదుగా ముద్దపురం వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కే ఆకును తొలగించేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. భీమలింగం కాలువ పరిధిలోని రైతులు గుర్రపు డెక్క ఆకుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆకును తొలగిస్తేనే సాగునీరు అందుతుందని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని కలిసి ఆకును తొలగించాలని కోరడం తో ఆయన వెంటనే స్పందించి తొలగింపు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం వలిగొండ చెరువు వద్ద ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ఆధ్వర్యంలో హిటాచి వద్ద కొబ్బరికాయ కొట్టి ఆకుల తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఆకు తొలగింపుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు చేరి భూములు సశశ్యామలం కానున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి , సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, నాయకులు పలుసం సతీష్ గౌడ్, గంగాపురం సతీష్ గౌడ్, కంచనపల్లి ,ముద్దాపురం గ్రామాల సర్పంచులు రేస్ బుచ్చిరెడ్డి, సామ రామ్ రెడ్డి, బత్తిని లింగయ్య ,పబ్బు సురేందర్ గౌడ్ ,కాసుల వెంకన్న గౌడ్, కొండూరు సాయి, చిలుకూరు సత్తిరెడ్డి ,రైతులు పాల్గొన్నారు.



## పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## డి టి ఎఫ్ మండల అధ్యక్షులు నవీన్ ప్రసాద్

**తుంగతుర్తి ఆగస్టు 7 (జనంసాక్షి)**
దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిటిఎఫ్ మండల అధ్యక్షులు నవీన్ ప్రసాద్ అన్నారు, శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుల పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై నాలుగు దశల పోరాటంలో భాగంగా మొదటి రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెండింగ్ డీఏలు తక్షణ విడుదల, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, జీఓ నెం.25 ఉపసంహరణ, 317 జీవో వల్ల ఏర్పడిన సమస్యలకు శాశ్వత పరిష్కారంతో పాటు ఉపాధ్యాయుల ఇతర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఇకపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు. అవసరమైతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూఎస్ పిసి నాయకులు పాల్గొన్నారు.

# పకృతి వనంలో పక్షుల ఆహారం కోసం విత్తనాలు విత్తిన హెల్పింగ్ హ్యాండ్స్ టు నీడి సేవ సంస్థ

**నాంపల్లి,ఆగస్టు 07 (జనం సాక్షి)**
హెల్పింగ్ హాండ్స్ టు నీడి" సేవా సంస్థ వ్యవస్థాపకులు సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయులు గురిజ మహేష్ ఆధ్వర్యంలో నాంపల్లి మండలం దామెర గ్రామం పల్లె ప్రకృతి వనంలో పక్షుల ఆహారం కోసం ఉపయోగపడేలా సజ్జలు, జొన్నలు, రాగులు వంటి తృణధాన్యాల విత్తనాలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా సేవాసంస్థ స్థాపకులు గురిజ మహేష్ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలనే సాగు చేస్తూ సజ్జలు, జొన్నలు, రాగులు వంటి తృణధాన్యాలను ఎక్కువగా పండించకపోవడం వలన పిచ్చుకలు, రామచిలుకలు వంటి పక్షులకు సరిపడా ఆహారం దొరకక పక్షులు మరణించి,కాలక్రమేనా వాటి సంఖ్య తగ్గడం వలన పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం, పంటలపై ఉండే క్రిమి కీటకాలను తినే పక్షుల సంఖ్య తగ్గడం వలన పంటలను నష్టపరిచే క్రిమి కీటకాలను సంహరించడానికి ఎక్కువ కృత్రిమ రసాయన మందులు వాడడం ద్వారా పర్యావరణానికి, మానవాళికి అనేక నష్టాలు జరుగుతున్నాయని, గ్రామాలలో ఉండే పల్లె ప్రకృతి వనాలలో, ఇంటి పక్కన ఉండే ఖాళీ స్థలాలలో, పార్కులలో జొన్నలు, సజ్జలు, రాగులు వంటి తృణధాన్యాల విత్తనాలు నాటడం ద్వారా పక్షులకు సరైన ఆహారం దొరికి కాలక్రమమైన పర్యావరణ సంరక్షణకు, సమతుల్యానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురిజ మహేష్, దామెర సహదేవ్, దామెర రమేష్, వీరమళ్ళ కృష్ణ, బచ్చనబోయిన లక్ష్మణ్, దామెర వెంకటయ్య, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు






## పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోండి..

**చంద్రుగొండ, ఆగస్ట్ 06(జనంసాక్షి ):**
భారత తపాలా శాఖ ప్రజలకు అనేక రకాల పొదుపు, భీమా, ఆర్థిక సేవలను అందిస్తుందని, వాటిని సధ్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డివిజన్ తపాలా శాఖ అసిస్టెంట్ పోస్టల్ సూపర్డెంట్ రాజా నర్సి గౌడ్ అన్నారు. రావికంపాడు గ్రామంలో గురువారం 'డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలాశాఖలోని గ్రామీణ తపాలా బీమా, పోస్టల్ తపాలా బీమా, రికరింగ్ డిపాజిట్, సేవింగ్ ఖాతాలు, టీడీలు, నెలవారీ ఖాతాల గురించి వివరించారు. ప్రతి ఇంటికీ పొదుపు ఖాతా ఉండాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలకంటే తపాలా శాఖ మెరుగైన సేవలను అందిస్తున్నాయన్నారు. సర్పంచ్ సరిత, పోష్టుమాష్టరు పవన్ కార్తీకేయా, గణేష్, ఆదర్శ్, రవితేజ, మేయిలోర్సర్లు సత్యనారాయణ, రాంప్రసాద్, జీపీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్ సరస్వతీ శిశు మందిర్‌లో బోనాల వేడుకలు



**బూర్గంపహాడ్ ఆగస్టు 06 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో గురువారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సహ కార్యదర్శి శ్రీ ఓరుగంటి సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, హితైషులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ఆధ్యాత్మిక విలువలు, కుటుంబ బంధాల గొప్పతనాన్ని చాటుతుందని వక్తలు పేర్కొన్నారు.

# ఒక ప్రాణాన్ని కాపాడేది అవయవ దానం దానం చేసిన వాడే గొప్ప దేవుడు..

## విద్యార్థుల్లో చైతన్యం నింపిన అవగాహన కార్యక్రమం..

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు7 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో తెలంగాణ స్టేట్ ఆర్గన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్, హైదరాబాద్ సహకారంతో భాగ్య క్లబ్ ఆధ్వర్యంలో "అవయవ దానం – మహాదానం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథి జి. గురు ప్రకాష్ అవయవ, శరీర దానం యొక్క ప్రాముఖ్యత, చట్టపరమైన అంశాలు, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించి విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ టి. హరిలాల్, భాగ్య క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎన్. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె. మాధవి మాట్లాడుతూ అవయవ దానం వల్ల ఒక కుటుంబం నిలబడుతుందని ,ఒక ప్రాణాన్ని కాపాడిన వ్యక్తిగా చరిత్రలో నిలుస్తామని , అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి, మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవయవ దానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సమాజంలో సానుకూల సందేశాన్ని వ్యాప్తి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.




## క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

### సంజీవరెడ్డి భవన్'లో కీలక సమావేశం

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 7 (జనంసాక్షి)**
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే నూతన మండల కమిటీలు, గ్రామ కమిటీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీల ఏర్పాటును పర్యవేక్షించి, సమన్వయం చేసేందుకు వీలుగా ఈరోజు మండలాలకు ప్రత్యేక ఇన్చార్జిలను నియమించడం జరిగింది. అనంతరం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన మహిళా రిజర్వేషన్ బిల్లుల ప్రాముఖ్యతపై శ్రేణులతో విస్తృతంగా చర్చించారు. పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంలో అనుబంధ సంఘాల పాత్ర ఎంతో కీలకమని నాయకులకు గుర్తుచేశారు. విద్యార్థి, యువజన విభాగాలైన ఎన్ఎస్యుఐ , యూత్ కాంగ్రెస్ లను మరింత క్రియాశీలకంగా మార్చేందుకు మరియు నూతన నియామకాలపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం అత్యంత కీలకమైన మీడియా, కమ్యూనికేషన్స్ విభాగాన్ని బలోపేతం చేయడం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అలాగే, సోషల్ మీడియా విభాగంలో కూడా నూతన నియామకాలు చేపట్టి ఆ విభాగాలను చురుగ్గా పనిచేసేలా తీర్చిదిద్దాలని సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విభాగాలు ఒకే తాటిపై సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలీయమైన శక్తిగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ అభ్యున్నతి కోసం శ్రమించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలను గడపగడపకూ తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నూతన మండల ఇన్చార్జిలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా బిల్లును ఆమోదించాలి: ఐద్వా

**భద్రాచలం ఆగస్టు 06 (జనంసాక్షి)**
డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా పార్లమెంట్ ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలంలోని చంద్రరావు భవన్‌లో ఐద్వా భద్రాచలం పట్టణ అధ్యక్షురాలు జీవనజ్యోతి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టి అమలును ఆలస్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వామపక్ష పార్టీల సుదీర్ఘ పోరాట ఫలితంగానే మహిళా బిల్లుకు ఆమోదం లభించిందని గుర్తుచేసిన ఆమె, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని ఆమె అన్నారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని కూడా నిర్వీర్యం చేసే చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

## చందంపేట నూతన ఏపీఎంగా చలపతి నాగలీలా బాధ్యతల స్వీకరణ

*గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల సమర్థ అమలుకు కృషి చేస్తానని వెల్లడి*

**చందంపేట ఆగస్టు 07 (జనం సాక్షి)**

చందంపేట మండలంలో నూతన సహాయ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)గా చలపతి నాగలీలా బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీఏపల్లి మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహించిన ఆమెకు పరిపాలనా అనుభవం ఉంది. చందంపేట మండలంలో ప్రభుత్వం చేపడుతున్న గ్రామీణాభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఉపాధి కల్పన తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అధికారులు, సిబ్బంది, సంఘాల సభ్యుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని ఏపిఎం పేర్కొన్నారు.

## ప్రతి సోమవారం 'ప్రజావాణి' - అధికారులు తప్పనిసరి హాజరు

**ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ ఆదేశాలు**

**మేళ్లచెరువు జనంసాక్షి**
సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు, ఆగస్టు 6 ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మేళ్లచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తామని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఖాజా అస్గర్ అలీ తెలిపారు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు http://G.O.Ms.No.4, ప్లానింగ్ విలేజ్ డిపార్ట్మెంట్ తేది: 04.08.2026 మరియు సూర్యాపేట జిల్లా కలెక్టర్ సర్క్యులర్ తేది: 05.08.2026 ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని తహశీల్దార్, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, విద్య, వైద్య, ఐసీడీఎస్, సంక్షేమ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం స్వయంగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను పరిశీలించి, వెంటనే ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, దరఖాస్తుదారులకు రసీదు అందజేయాలని సూచించారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించి, ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, అధికారులెవరూ గైర్హాజరు కాకుండా సమయపాలన పాటిస్తూ 'ప్రజావాణి'ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ కోరారు.

## ఈనెల 12న 'చలో విద్యుత్ సౌదా' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: టీజీపీఈ జేఏసీ పిలుపు

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 7 (జనం సాక్షి):**
యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1, స్టేజ్-2లోని కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ (ఽఉఖఇ) జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న 'చలో విద్యుత్ సౌదా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ బీటీపీఎస్ ప్రాంతీయ నాయకులు పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత 39 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట ఆందోళన నిర్వహించి, యాజమాన్యం తీరును నిరసించారు.



# ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు

**○దమ్మపేట మండలం కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన.,**

**○దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో బోర్‌వెల్, మహిళాశక్తి క్యాంటీన్,మరుగుదొడ్ల నిర్మాణ పనులను చేపట్టిన ఎమ్మెల్యే జారే..**



**దమ్మపేట ఆగస్టు 7 (జనంసాక్షి):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు.శుక్రవారం దమ్మపేట మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం దమ్మపేట మండలం పార్కలగండి పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేశారు.సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు మౌలిక వసతులు అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల ఇబ్బందులు తొలగనున్నాయని అన్నారు. అదేవిధంగా కార్యాలయానికి వచ్చే ప్రజలు, సందర్శకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళాశక్తి క్యాంటీన్, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన,వనమహోత్సవంలో భాగంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. వనమహోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాలు,పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని దశలవారీగా పూర్తి



చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో (ట్రైనింగ్ కలెక్టర్),దమ్మపేట తహసిల్దార్ మద్దినేని మురళి,స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కోచింగ్ ప్రారంభం..

పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి..

కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 7, (జనం సాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థుల కోసం టి.జె.ఎల్.ఎస్.ఎస్. ( తోకల జగన్నాధం?లక్ష్మమ్మ సేవా సమితి), పాల్వంచ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ ప్రారంభించారు.

ముఖ్య అతిథి టి.జి.ఎస్.పి.ఎఫ్., కె.టి.పి.ఎస్. యూనిట్ డి.ఎస్.పీ. ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో శారీరక సాధనతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాల్లో పట్టు సాధిస్తే పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమవుతుందని విద్యార్థులకు సూచించారు.

ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్, పోలీస్ నియామక పరీక్షల మోడల్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకల రామదాసు, డాక్టర్ టి. అరుణ కుమారి, కోటగిరి రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ తులసి విజయ్ ప్రసాద్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.






## స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం, (జనంసాక్షి) :**

ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థులు సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. పోటీల్లో అండర్-14 కుమిటే బాలుర విభాగంలో టి. రోహిత్ బంగారు పతకం, కె. కౌషిక్ గౌడ్ కాంస్య పతకం సాధించారు. అండర్-12 కుమిటే బాలుర విభాగంలో ఎస్.కె. ఊబెద్ బంగారు పతకం గెలుచుకోగా, అండర్-12 కటా బాలుర విభాగంలో ఈ. సంజయ్ రజత పతకం, ఎన్. పృథ్వీరాజ్ కాంస్య పతకం సాధించారు. అండర్-10 కటా బాలుర విభాగంలో ఎన్. మహద్యుత్ సాయి కాంస్య పతకం సాధించి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు. ఈ విజయాలతో స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ-2026ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో డైరెక్టర్లు కె. శ్రీధర్‌రావు, కృష్ణవేణి విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు. చిన్న వయస్సులోనే సౌత్ ఇండియా, ఆసియా, అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటడం విద్యార్థుల కృషికి నిదర్శనమని కొనియాడారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విజేతలను అభినందించారు.

# మోడల్ స్కూల్‌లో ఘనంగా మాక్ ఎలక్షన్






**పెనుబల్లి, ఆగస్ట్ 7(జనంసాక్షి)**

మండల పరిధిలోనిటేకులపల్లి మోడల్ స్కూల్‌లో సాంఘిక అధ్యాపకుల ఆధ్వర్యంలో "మాక్ ఎలక్షన్" ఘనంగా నిర్వహించారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ కొరకు నమూనా ఎన్నికల నిర్వహణ చేయడం జరిగింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేయడం, ప్రాక్టికల్ అనుభవం పెంపొందించడం జరిగింది. అనంతరం ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని సివిక్స్ అధ్యాపకులు రాంప్రసాద్, కామర్స్ అధ్యాపకులు శ్రీమతి నాగమణి, ఎకనామిక్స్ అధ్యాపకులు శ్రీమతి శ్రీదేవి, సోషల్ ఉపాధ్యాయులు రాంబాబులు,తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ టి.బి. రూపస్ మార్గదర్శనం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పిఆర్సిని వెంటనే ప్రకటించాలి

## పెండింగ్ డిఎ లను విడుదల చేయాలి..




**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు7 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు మూడు సంవత్సరాల క్రితమే ఇవ్వాల్సిన పిఆర్సిని వెంటనే ప్రకటించి పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలియజేశారు.సిపిఎస్ ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,పెండింగ్ బిల్లులు అన్నింటిని ఏక మొత్తంలో విడుదల చేయాలని,హెల్త్ కార్డులపై సమగ్రమైన ఉత్తర్వులు ఇచ్చి అన్ని రిఫరల్ హాస్పిటల్లో అమలయ్యేలా చూడాలని,2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఈ నెలలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టాలని,గిరిజన సంక్షేమ శాఖలోని పండిట్,పీఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేసి వారికి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని,జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు జీవో 190 ప్రకారం వెంటనే డిప్యూటేషన్లు ఇవ్వాలని,రేషనలైజేషన్ జీవో 25న సవరించాలని,ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా,50 మంది విద్యార్థులు ఉంటే తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉండేలా జీవోను సవరించాలని కోరారు. ఈనెల 12,13వ తేదీలలో మండల తాసిల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు,19న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం,29న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం కలదని,ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ నిరసన ప్రదర్శనలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్య కీలకమైన దిక్సూచి

## ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు




**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 7 ( జనంసాక్షి)**

డిగ్రీ విద్య విద్యార్థి దశలో కీలకమైనదని జీవితం లో స్థిరపడటానికి దిశా నిర్దేశం చేసే దిక్సూచిగా నిలుస్తుందని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి విద్యార్థులకు సూచించారు. గత రెండు రోజులుగా ఐ.క్యూఏసి ఆధ్వర్యంలో ఈ వార్షిక విద్యా సంవత్సరం లో వివిధ విభాగాల్లో డిగ్రీ లో చేరిన విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. కళాశాల వార్షిక విద్యాత్మక కార్యక్రమాల తీరుతెన్నులు సిలబస్ , సెమిస్టర్ పరీక్షల విధానం , విద్యార్థి కేంద్రంగా నిర్వహించే ప్రత్యేక సృజనాత్మక కార్యక్రమాల స్వరూప స్వభావాలు లైబ్రరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, సామాజిక సేవలు.ఎన్.సి.సి , కళాశాలలో గల మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ఆర్ట్స్ సైన్స్ కామర్స్, కంప్యూటర్స్ వివిధ విభాగాధిపతులు, విషయ నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.క్రమశిక్షణతో సమయపాలన చదువే లక్ష్యంగానిరంతర అధ్యయనం తో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్,ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, ఎగ్జామ్స్ కంట్రోలర్ రమా సత్యవతి, లైబ్రేరియన్ డా.విజయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వెంకన్న,ఎన్.సి.సి ఆఫీసర్ డా.ఓంకార్, ఎన్.ఎస్.ఎస్ పి.ఓలు డా.పిచ్చయ్య,ధర్మయ్య వివిధ విభాగాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రలో విలీనం చేసిన ఐదు పంచాయతీలను తెలంగాణకు తిరిగి అప్పగించాలి

**● 'రాముడు ఇక్కడ... భూములు అక్కడ' పరిస్థితికి ముగింపు పలకాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా.. ● పోలవరం భద్రాద్రి మనుగడకే ముప్పు.. ● సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, దెబ్బతిన్న రహదారులు బాగుచేయాలని డిమాండ్**

**భద్రాచలం ఆగస్టు 07 (జనంసాక్షి)**
రాష్ట్ర విభజన సమయంలో అశాస్త్రీయంగా ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండో రోజు శుక్రవారం సారపాక నుంచి ప్రారంభమైన యాత్ర భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల మీదుగా తిప్పాపురం గ్రామంలో ముగిసింది. యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల ప్రాంతాల్లో నాయకులకు పూలమాలలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. భద్రాచలంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, తూర్పాకలో జయరామరెడ్డి స్మారక స్థూపానికి, నరసాపురంలో రావులపల్లి నాగభూషణం స్మారక స్థూపానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రజెండాలతో సాగిన మోటార్‌సైకిల్ ర్యాలీలు, పాదయాత్రలు, ప్రజానాట్యమండలి ఆటపాటలు యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మాట్లాడిన సాబీర్ పాషా ప్రజల హక్కులు, గిరిజనుల అస్తిత్వం, ఏజెన్సీ ప్రాంత భవిష్యత్తు పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, దేవస్థానానికి చెందిన భూములు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం చారిత్రకంగా, పరిపాలనా పరంగా, ఆధ్యాత్మికంగా సమంజసం కాదన్నారు. "రాముడు ఇక్కడ... భూములు అక్కడ" అనే పరిస్థితికి కేంద్ర, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ముగింపు పలకాలని కోరారు. సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టులను పూర్తి చేసి భద్రాద్రి జిల్లాకు సమృద్ధిగా సాగునీరు అందించాలని, ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్‌వాటర్ ప్రభావంతో గిరిజన గ్రామాలు, వ్యవసాయ భూములు, అడవులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాద్రి ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో గోదావరి వరదలతో భద్రాచలం పట్టణం సహా అనేక గ్రామాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ శాశ్వత పరిష్కారంపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. గోదావరి తీరంలో శాస్త్రీయ ప్రమాణాలతో బలమైన కరకట్టలు నిర్మించి శాశ్వత వరద నియంత్రణ ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు.
భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరతను వెంటనే తీర్చాలని, అన్ని స్పెషాలిటీల్లో వైద్యులను నియమించాలని కోరారు. తరతరాలుగా సాగు చేస్తున్న గిరిజన రైతులకు పోడు భూములపై పెండింగ్ హక్కు పట్టాలు మంజూరు చేసి అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.
వాజేడు నుంచి భద్రాచలం వరకు ఇసుక లారీల రాకపోకలతో ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని, కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు సంపాదిస్తుండగా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారని ఆరోపించారు. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేశారు. ముద్వా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రెండో రోజు ప్రజా చైతన్య యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, మూడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, యు. రాహుల్, ఎస్.కే. ఫహీం, ఎస్‌వీఎస్ నాయుడు, పేరాల శ్రీనివాస్, మారేడి శివాజీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# ఎమ్మెల్యే మట్టా దంపతుల చొరవతో యర్రబోయినపల్లికి బస్సు సౌకర్యం

**కల్లూరు ఆగస్టు 07 (జనంసాక్షి)**
తమ ఊరికి బస్సు ఎప్పుడు వస్తుందా తమరి కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని ఎదురుచూస్తున్న యర్రబోయినపల్లి ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. ఇకపై యర్రబోయినపల్లి రోడ్లపై ఆర్టీసీ బస్సు పరుగులు పెట్టేందుకు రంగం సిద్ధమైంది. జులై 30న కల్లూరు మున్సిపాలిటీ కేంద్రంలోని డి ఎన్ పి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ అధ్యక్షతన రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిఆధ్వర్యంలోప్రతిష్టాత్మకంగా ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. ఇదే తరుణంలో ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న ఓ బాలుడు మా ఊరికి బస్సు కావాలి సార్ అంటూ అడిగిన తీరుకి ఫిదా అయిన మంత్రి పొంగులేటి ఆర్టీసీ అధికారులతో వారం రోజుల్లో యర్రబోయినపల్లి గ్రామానికి బస్సు సర్వీసులు నడిపించాలని ఆదేశించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆదేశాల మేరకు శుక్రవారం యర్ర బోయినపల్లి చేరుకున్న మధిర డిపో మేనేజర్ తో పాటుకల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రూ అర్జున్ రావు,ఏఎంసీ డైరెక్టర్ దొడ్డపునేని శ్రీనివాసరావు కలిసి చెన్నూరు నుండి యర్రబోయినపల్లి మీదుగా లింగాల వరకు బస్సు నడిచేందుకు కావలసిన పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్తుల అవసరతను గమనించిన డిపో మేనేజర్ ఆర్టీసీ మధిర డిపో ఆర్ ఎం కు నివేదిక అందజేస్తామని త్వరలోనే యర్రబోయినపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని గ్రామస్తులకు తెలిపారు. కల్లూరు టు మధిర సర్వీసులలో విద్యార్థుల సౌకర్యం కోసం ఉదయం 8 గంటలకు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తిరిగి సాయంత్రం 5 లేదా 6 గంటల సమయంలో బస్సు నడిచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సైదులు, స్థానికులు నల్లగట్ల పుల్లయ్య, కొలికపోగు కృష్ణ, గూడ జోజి, నల్లగట్ల గోపాలకృష్ణ, తాళ్ల భూషణం, తదితరులు పాల్గొన్నారు.



# అంబరాన్నంటిన బోనాల సంబరాలు

## శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా బోనాల పండుగ..

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు7 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాణి మిరియాల అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు బోనం విశిష్టతను గురించి వివరించారు తెలంగాణలో బోనాల పండుగ కొన్ని సంవత్సరాల నుండి అంగరంగ వైభవంగా జరుగుతుందని అన్నారు. కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బోనం అనేది భక్తికి కృతజ్ఞతలకు గ్రామ దేవతల పై ఉండే అపారమైన విశ్వాసానికి ప్రతిగానే అన్నారు. పోచమ్మ మైసమ్మ ఎల్లమ్మ దేవతకు భక్తుతో ప్రేమతో సమర్పించే నైవేద్యం బోనమని విద్యార్థులకు వివరించారు. పాఠశాలలోనే విద్యార్థులు బోనాలు ఎత్తుకొని సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించారు వివిధ వేషధారణలో అందరినీ అలరించారు. బోనాల పాటకు అందరూ అలరించి డాన్సులు వేశారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్చార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, శిరీష, చందన, భవాని, భావన, శ్రావణి,జనిత, తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుక్కడపు బాలకృష్ణ గౌడ్ కి ఘన సన్మానం

**హుజూర్ నగర్, ఆగస్టు 7 (జనంసాక్షి):**
నూతనంగా హుజూర్‌నగర్ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ గౌడ్ కి, హుజూర్ నగర్ గౌడ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఆత్మీయ సన్మాన చేశారు. పట్టణ గౌడ సొసైటీ అధ్యక్షుడు పండ్ల హుస్సేన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై, బాలకృష్ణకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, గౌడసంఘం, యువజన సంఘం, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు బాలకృష్ణని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా న్యాయవాదిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఈనెల 10 వ తేదీన రవీంద్రభారతిలో జరగనున్న జైగౌడ వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను మున్సిపల్ చైర్మన్, గౌడ సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్సై దొంతగాని నాగేశ్వరరావు గౌడ్, గౌడ యువజన సంఘం అధ్యక్షులు బెల్లంకొండ అమర్ గౌడ్, పట్టణ గౌడ సొసైటీ అధ్యక్షులు పండ్ల హుస్సేన్ గౌడ్, జైగౌడ జాతీయ ఉపాధ్యక్షులు నారగోని శంకర్ గౌడ్, జై గౌడ్ సంఘ జిల్లా అధ్యక్షుడు కేశగాని నాగేశ్వరరావు గౌడ్, పులి గోవింద్ గౌడ్, పుట్ట నర్సింహా గౌడ్, సోమగాని నరసింహ గౌడ్, కొప్పు రామకృష్ణ గౌడ్, కోల శ్రీనివాస్ గౌడ్, పండ్ల నాగరాజు గౌడ్, గండు అర్జున్ గౌడ్, గండు సతీష్ గౌడ్, నర్సింగ్ సతీష్ గౌడ్, కుక్కడపు నరేష్ గౌడ్, వీరమల్ల రామకృష్ణ, సోమగాని మహేష్ గౌడ్, బత్తిని శంభులింగం తదితరులు పాల్గొన్నారు.



# పి ఆర్ సి సాధించేవరకు దశల వారి పోరాటం కొనసాగిస్తాం

## ఉపాధ్యాయ సంఘాల నేత వెంకటేశ్వర్లు వెల్లడి

**కామేపల్లి,ఆగస్టు 7 (జనంసాక్షి):**
ఉపాధ్యాయు లకు పిఆర్సి ప్రకటించే వరకు దశల వారి పోరాటాలు కొనసాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేత జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.భోజనం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్సి సాధన, పెండింగ్ డీఏ ల కొరకు జీవో 25 సవరణ,సిపిఎస్ రద్దు లాంటి డిమాండ్ల సాధన కోసం దశలవారి పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి రవికుమార్,వీరభద్రం వి ఎస్ రెడ్డి,టీ కైలాస రావు,ఎస్.కె రంజాన్,హెచ్ఎం పి జ్యోతి,భవాని, కవిత,అరుణ, జ్యోతి,రమ ప్రభ, విజయ కుమారి, ఉష తదితరులు పాల్గొన్నారు.



## పిఆర్సి ప్రకటనపై తెలంగాణ ప్రభుత్వం దిగి రావాలి

**ఆగస్టు 29న చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద మహాసభను విజయవంతం చేయాలి**

**టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు**







**ఆళ్లపల్లి ఆగస్టు 7( జనం సాక్షి)** మండలకేంద్రం లోని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆళ్లపల్లి మరియు ఆశ్రమ ఉన్నత పాఠశాలలు జిపిఎస్ మైలారం పిఆర్సి సాధనకై పోరాటం ఉధృతం చేద్దామని తీర్మానం. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్,జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ విద్యా రంగం,పాఠశాల,విద్యార్థి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు యూఎస్ పిసి ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు విజయవంతం చేయాలని తెలిపారు ఆగస్టు 29న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాసభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు పిఆర్సి వెంటనే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించాలని ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేసి చొరవ చూపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు తెలంగాణ ప్రభుత్వం చట్టబద్ధమైన ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా చూడాలని చూస్తే పెద్ద ఎత్తున అసెంబ్లీ ని ముట్టడించే కార్యక్రమాలు చేపడతామని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్, బి బాబులాల్,సిహెచ్ భద్రమ్మ,జి కుమార్ రాజా,పి వెంకటేశ్వర్లు,కోటేశ్వరమ్మ, బాలాజీ,వీరన్న,వీరన్న,సాంబశివరావు, కృష్ణ,నాగమణి,మమతా రాణి,లీలావతి, లక్ష్మి,రాంబాబు,పద్మావతి,అభిజ్ఞ జ్యోతి, బాలాజీ, జి చంద్రరావు,హరినాథ్, బన్సీలాల్, సురేష్, ప్రవీణ్ కుమార్, చెన్నేశ్వరరావు,ఎస్కే పాష,రేణుక,ప్రేమ్ కుమార్,కొమరం లాలయ్య,భద్రమ్మ, వెంకటరమణ, సంపత్, లక్ష్మీనారాయణ, శ్రీను,చిన్ని,పూర్ణ, బిక్షమయ్య, స్వరూప, వసంతరావు, ప్రసాద్ రావు,వసంత,ఈశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటికి వివాహ ఆహ్వానం అందజేసిన పోతిరెడ్డి దంపతులు



**బూర్గంపహాడ్ ఆగస్టు 07 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సత్యావతి దంపతులు తమ కుమారుడి వివాహ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి ని శుక్రవారం ఖమ్మంలో కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేసి, వివాహ వేడుకలకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి పోతిరెడ్డి దంపతులను, వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పల కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో పోతిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# తండ్రి కోసం కూతురు.. భర్త కోసం భార్య పోరాటం..

**❍ ఐదేళ్లుగా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపణ..**



**భద్రాచలం ఆగస్టు 07 (జనంసాక్షి)** భర్తగా, తండ్రిగా కుటుంబానికి అండగా నిలవాల్సిన వ్యక్తే తమను పూర్తిగా విస్మరించారని ఆరోపిస్తూ భద్రాచలానికి చెందిన విజయలక్ష్మి, ఆమె కుమార్తె వెన్నెల శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న బోళ్ల కాంప్లెక్స్ వద్ద స్థానిక మహిళలతో కలిసి తల్లికూతురు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఐదేళ్లుగా భర్త కోటయ్య కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని, కుటుంబ పోషణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా తమను తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు కుటుంబ పెద్దల సమక్షంలో చర్చలు, భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిగినప్పటికీ ప్రతి సారి కుటుంబాన్ని చూసుకుంటానని హామీ ఇచ్చి చివరకు మాట తప్పారని వాపోయారు. ప్రస్తుతం కోటయ్య భద్రాచలం వదిలి వెళ్లిపోయి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఆచూకీ కూడా తెలియకుండా ఉన్నారని, అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. తన మామ (భర్త తండ్రి) మల్లికార్జున్ పలుమార్లు తనను లైంగికంగా వేధించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ విషయాన్ని భర్త కోటయ్యతో పాటు మల్లికార్జున్ భార్య మణెమ్మ, కుమార్తె గంగ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ తన మాట నమ్మలేదని, పైగా తనకే మానసిక సమస్య ఉందంటూ బలవంతంగా హైదరాబాద్‌లోని మానసిక ఆస్పత్రిలో చేర్పించారని ఆరోపించారు. అయితే తనకు ఎలాంటి మానసిక సమస్య లేదని వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా తన కుమార్తె వెన్నెల పట్ల కూడా మల్లికార్జున్ అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించారని, అందుకే కుమార్తె తన వద్దే ఉంటోందని పేర్కొన్నారు. భర్తకు వ్యాపారాలు, ఇళ్లు, స్థలాలు సహా ఆస్తులు ఉన్నప్పటికీ తమను రోడ్డున పడేశారని, ఈ వ్యవహారంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వెన్నెల మాట్లాడుతూ.. తాను పదో తరగతి చదువుతున్నప్పటి నుంచే తండ్రి తమను పూర్తిగా పట్టించుకోవడం మానేశారని, ప్రస్తుతం యూనివర్సిటీ ఫీజు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడడంతో చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి మానసిక రోగి కాదని వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ కావాలనే అపవాదు మోపారని, పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపింది. తమ భర్త, తండ్రిని గుర్తించి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, తమకు చట్టపరమైన న్యాయం చేసి జీవనోపాధి, చదువు కొనసాగేందుకు అవసరమైన సహాయం అందించాలని సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని తల్లి, కుమార్తె విజ్ఞప్తి చేశారు.




## లక్ష్మీపురంలో ట్రాఫిక్ నియంత్రణకు 'నో పార్కింగ్' బోర్డులు ఏర్పాటు - ఎస్ ఐ మేడా ప్రసాద్

**బూర్గంపహాడ్ ఆగస్టు 07 (జనంసాక్షి)** రోడ్డు వెంట వాహనాల అక్రమ పార్కింగ్ కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు బూర్గంపహాడ్ పోలీసులు చర్యలు చేపట్టారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా మొత్తం 10 'నో పార్కింగ్' బోర్డులను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ మేడా ప్రసాద్ మాట్లాడుతూ, రహదారిపై ఇష్టాను సారంగా వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ప్రజల సౌకర్యం, రహదారి భద్రత దృష్ట్యా ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలపకుండా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ నాగబిక్షం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు

**సర్పంచ్ రవళి రాణా ప్రతాప్**

**యాదగిరిగుట్ట, ఆగస్టు 07 (జనంసాక్షి)** ఏ ఆధారాలు లేకుండా మాపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని వంగపల్లి గ్రామ సర్పంచ్ ఒగ్గు రవళి రాణాప్రతాప్ హెచ్చరించారు. యాదగిరిగుట్ట మండల పరిధిలోని వంగపల్లి గ్రామంలో విలేఖరులతో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 122 లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతుంటే గొంగిడి రాజశేఖర్రెడ్డి అనే వ్యక్తి వాటిని తొలగించారని తెలిపారు. వంగపల్లి గ్రామాభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, అంతేకాకుండా గొంగిడి రాజశేఖర్రెడ్డిని రూ.30 లక్షలు మేము డిమాండ్ చేసినట్టు ప్రచారం చేస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేసినట్టు ఆధారాలుంటే చూపించాలని, మేము దేనికైనా సిద్ధమేనన్నారు. ఈ విషయంపై ఇప్పటికే యాదగిరిగుట్ట సీఐకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.




## జైలు భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బత్తుల పిలుపు



**బూర్గంపహాడ్ ఆగస్టు 07 (జనంసాక్షి)** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం సారపాకలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల కేంద్రంలో జైలు భరో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, 29 కార్మిక చట్టాల కొనసాగింపు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించడం తదితర డిమాండ్లతో ఉద్యమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌కే పాషా, ఎస్‌కే అబిద్, యాకోబు నాయుడు, పొన్నం దమయంతి, రాణి, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి టీసీ ఇప్పించడంలో ఎంఈఓ నిర్లక్ష్యం- ఉన్నతాధికారుల జోక్యం కోరిన విద్యార్థి తండ్రి



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 7 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని రెజీనా పాఠశాలలో చదివిన ఓ విద్యార్థికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) ఇప్పించేందుకు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కి ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థి తండ్రి ఆరోపించారు. పాఠశాల యాజమాన్యంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని విద్యార్థికి వెంటనే టీసీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, ఎంఈఓ కార్యాలయం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు. దీంతో విద్యార్థి విద్యాభ్యాసానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించడం బాధాకరమని పేర్కొంటూ, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వెంటనే ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థికి తక్షణమే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో లోకాయుక్త, రాష్ట్ర విద్యాశాఖతో పాటు ఇతర సంబంధిత అధికారులను ఆశ్రయించి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థి తండ్రి హెచ్చరించారు.

# రిజర్వేషన్ల ఆవిర్భావ దినోత్సవాన ఉచిత వైద్య శిబిరం

## కాలేయం, ఎముకల పరీక్షలకు విశేష స్పందన



**ఖమ్మం , ఆగస్టు 7, (జనంసాక్షి) :** రిజర్వేషన్ల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ దిశ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో కాలేయ పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగిన శిబిరంలో సుమారు నూట యాభై మంది పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన చారిత్రక సందర్భాన్ని గుర్తు చేశారు. అదే రోజున ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మాజీ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు కురాకుల నాగభూషణం మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. కాలేయం, జీర్ణవ్యవస్థ వ్యాధుల నిపుణుడు డాక్టర్ కపిల్ తేజస్వి మాట్లాడుతూ, మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా కాలేయం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించడం వల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్, డాక్టర్ క్రాంతి రణదేవ్ మాట్లాడుతూ, సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఆసుపత్రి మేనేజ్మెంట్ ప్రతినిధి మేకల సుగుణారావు మాట్లాడుతూ, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలకు సంబంధించిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గుండెపాక నర్సయ్య, స్వర్ణ భాస్కర్, పెరుగు వెంకటరమణ యాదవ్, గుమ్మ రోశయ్య, నరేందర్, నెమలి కిషోర్, డాక్టర్ రమేష్, సోమనబోయిన రమేష్, అనిల్, అజయ్, ఆసుపత్రి సిబ్బంది, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఇరవెండిలో ఉచిత వైద్య శిబిరం..

## హెచ్ఐవి పరీక్షలపై అవగాహన

**బూర్గంపహాడ్ ఆగస్టు 07 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామంలో వైఆర్జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఆర్జీ కేర్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తులపై ఎలాంటి వివక్ష చూపకుండా, వారిని గౌరవంగా చూడాలని ఆమె కోరారు. ఎంఎల్హెచ్పీ జ్యోతి మాట్లాడుతూ హెచ్ఐవి కేవలం నాలుగు నిర్దిష్ట మార్గాల ద్వారానే వ్యాపిస్తుందని, అపోహలను నమ్మవద్దని ప్రజలకు వివరించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు హెచ్ఐవి, సిఫిలిస్, రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఆర్జీ కేర్ సూపర్వైజర్ లక్ష్మి, లింక్ వర్కర్ కుమారి, ఎంఎల్హెచ్పీ జ్యోతి, మొదటి ఏఎన్ఎం నాగదేవి, రెండవ ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## ఓబిసి రిజర్వేషన్ల ప్రదాత బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్

**బిపి మండల్ యాదవ్ కు నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్**

**కామేపల్లి,ఆగస్టు 7 (జనంసాక్షి):** భారతదేశ చరిత్రలో ఓబీసీలకు ఆగస్టు 7వ తారీకు ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిందని, దానికి స్ఫూర్తి ప్రదాత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ అని,ఆ మహనీయుని వల్లనే ఓబీసీల తలరాతలు మారడం జరిగిందని,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అభివర్ణించారు.

మండల్ రిజర్వేషన్ డే సందర్భంగా కామేపల్లి మండలం లోని పండితాపురం లో శుక్రవారం బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తారీకు ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని,దీనికి ప్రధాన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ యాదవ్ కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన మహా నాయకుడు అని,తన జీవితమంతా రాజకీయ అధికారం కోసం కాకుండా ఓ బి సి,ఎస్ సి ఎస్ టి వర్గాల కు సమాన అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిన మహాయోధుడని, ఆ పోరాటానికి ఫలితంగా 1990 ఆగస్టు 7వ తారీఖున నాటి ప్రధాని విపి సింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని,ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఎంపీగా,కేంద్ర మంత్రిగా పనిచేసినప్పటికీ నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడి రిజర్వేషన్లు సాధించారు. అంతకుముందు ఏ నాయకుడు చేయని విధంగా దేశమంతటా పర్యటించి బడుగు బలహీన వర్గాల స్థితిగతులను గమనించి దేశంలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఒక వ్యక్తి తన కోసం కాకుండా సమాజం కోసం బ్రతికారని, అలాంటి బీపీ మండల్ యాదవ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్,కొమ్మి నేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య,మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు,బండి ఉపేందర్,ధరావత్ హరిచంద్ర,మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, దేరంగుల తిరపయ్య, రామారావు,తురక బిక్షం,చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలి
- వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య






**భద్రాచలం ఆగస్టు 07 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ నిబంధనల అమలు అత్యంత కీలకమని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య అన్నారు. భద్రాచలంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అమ్మ జన్మనిస్తుంది... హెల్మెట్ పునర్జన్మనిస్తుంది" అనే నినాదంతో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని పేర్కొంటూ, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లతో వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం (పీయూసీ) వంటి అన్ని పత్రాలను ఎల్లప్పుడూ చెల్లుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో సహాయం చేయడం కూడా ప్రతి పౌరుడి బాధ్యతేనని వెంకట పుల్లయ్య పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొని రోడ్డు భద్రతకు సంబంధించిన సూచనలు తెలుసుకున్నారు.

## పి ఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ వి ఎం బంజర్ పాఠశాలలో విద్యార్థుల ఎన్నికలు



**పెనుబల్లి. ఆగస్ట్ 7(జనంసాక్షి)** పెనుబల్లి మండలం పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ వి ఎం బంజర్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల ఎన్నికలు జరిగాయి . ఈ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణం లో విజయవంతంగా సాధారణ ఎన్నికల తరహాలో నిర్వహించడం జరిగినది. గెలుపొందిన అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గెలుపొందిన అభ్యర్థులకు,ముఖ్య అతిథులు రిటైర్డ్ ఉపాధ్యాయులు వివి రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ భాస్కరరావు, తగు సూచనలు సలహాలు అందించారు. ఎస్ పి ఎల్ గాఎం గాయత్రి, జనరల్ సెక్రెటరీగా ఎస్.కె సూరజ్, కల్చరల్ సెక్రటరీగా జి ఉమ, గేమ్స్ సెక్రటరీగా పి అహల్య, గర్ల్స్ రిప్రజెంటేటివ్ గా టి మనీషా ఎన్నికైనారు. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



## మల్లెలమడుగు ప్రగతి విద్యానికేతన్‌లో ఘనంగా బోనాల పండుగ సంబరాలు

**అశ్వాపురం ఆగస్టు 7 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మల్లెలమడుగు గ్రామంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ బోనాలు తెలంగాణ ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ అని తెలిపారు. చిన్నారులకు చిన్నతనం నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పండుగల ద్వారా పిల్లల్లో ఐకమత్య భావం, సంస్కార విలువలు పెంపొందుతాయని, వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి ఇవి దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బోనాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు.పండుగను పాఠశాలలో నిర్వహించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతిని విద్యార్థులకు చేరువ చేస్తున్న ప్రగతి విద్యానికేతన్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ జి. ఈశ్వరయ్యను వారు అభినందించారు.అలాగే ప్రగతి విద్యానికేతన్‌లో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యతో పాటు విశాలమైన ఆటస్థలం, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నందుకు స్థానిక తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు.




**12 గంటల కరెంటుతో సాగుకు దెబ్బ**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించేవారని, ప్రస్తుత ప్రభుత్వం దానిని 12 గంటలకు కుదించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు ఇస్తున్నా, ఆ సమయంలో కూడా 3-4 సార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది.రైతు వట్టికోటి నరేష్ మాట్లాడుతూ కరెంటు ఉన్నా నీళ్లు పెట్టుకోలేం. 2 గంటలు వచ్చి 1 గంట పోతుంది. రాత్రి పూట కరెంటు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. గత నెలలో 3 మోటార్లు కాలిపోయాయి. వాటిని రిపేర్ చేయించుకోవడానికి ?15 వేలు ఖర్చు అయ్యింది"బి అని తెలిపారు

**ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు**

గత యాసంగి సీజన్ లో మండలంలోని ఐ కె పి కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్నీ సంచులు, రవాణా వాహనాల కొరతతో రైతులు 15-20 రోజుల పాటు ధాన్యంతో రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వచ్చింది ఐ కె పి "కేంద్రానికి ధాన్యం తీసుకెళ్తే 'సంచులు లేవు' అంటారు. ఉన్నా ప్రతి సంచికి 4 కిలోలు తూకంలో కోత పెడుతున్నారు. అధికారుల చుట్టూ తిరగలేక చివరికి క్వింటాకు ?200 తక్కువకు వ్యాపారులకు అమ్ముకున్నాం. ప్రభుత్వం 'ప్రతి గింజ కొంటాం' అన్న మాట ఏమైంది?" గడ్డి పుల్లయ్య ప్రశ్నించారు.

**రైతు భరోసా ఆలస్యం, అప్పుల భారం**

ఎకరాకు ?7,500 రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, మండలంలో ఇంకా కొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. విత్తనాలు, ఎరువులు, కూలీలకు డబ్బులు లేక రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. "డబ్బులు టైం కి రాకపోతే పంట పెట్టుబడి ఎలా పెడతాం?" రుణ మాఫీ కూడా కొంత మందికి అవ్వలేదు అని మహిళా రైతు ప్రశ్నిస్తున్నారు.

**తాగునీరు, ఇతర సమస్యలు**

మిషన్ భగీరథ పథకం ఉన్నా మండలంలోని కొన్ని గ్రామాల్లో వారానికి 3 రోజులు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో మహిళలు మళ్లీ కిలోమీటర్ల దూరం కుండలతో నీళ్ల కోసం వెళ్ళే పరిస్థితి వచ్చింది

**మూలిగే నక్క మీద తాటిపండు పడినట్టు రైతులకు ఎల్ నినో ఎఫెక్టు**

మూలిగే నక్క మీద తాటిపండు పడినట్టు ఇప్పటికే రైతన్న పరిస్థితి అధ్వానంగా ఉంది అంటే ఎల్ నినో వచ్చీ వర్షాలు రాక,పంటలు అన్ని ఆగమై పుట్టెడు కష్టాలలో రైతులు బిక్కు బిక్కు మంటూ వర్షం కొరకు ఎదురు చూస్తున్నారు.బంగారం బ్యాంకు లో తాకట్టు పెట్టి,వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చి,పత్తి పంట వేస్తే వర్షాలు రాక పంటలు ఎండిపోయి ఏమీ చేయాలో తెలియక గతి తప్పిన రైతు అన్న బతుకు చిత్రం.

**ప్రతిపక్షం ఏమీ చేస్తుంది?**

తెలంగాణలో రైతులు ఇబ్బందుల మీద ప్రధాన ప్రతిపక్షం అయినా బి ఆర్ ఎస్ నాయకులు గట్టిగానే కొట్లాడుతున్నారు.రైతులతో కలిసి ధర్నాలు,రాస్తారోకో లు, అసెంబ్లీ లో ప్రభుత్వాన్ని గట్టిగానే నిలదీస్తునారు,అయిన ఇంకా ప్రజల పక్షాన కొట్లడలిసినా అవసరం చాలా ఉంది.
ప్రభుత్వం ఒకవైపు వేల కోట్ల సంక్షేమం అంటూ ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో రైతు మాత్రం కన్నీళ్లు పెడుతున్నాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో రైతాంగ ఆగ్రహం తీవ్రంగా ఉంటుందనడంలో సందేహం లేదు.



**జాతీయ చేనేత దినోత్సవం**

## చేనేత వస్త్రాలు ధరించి రంగానికి చేయూతనివ్వాలి

### కలెక్టర్ బి. చంద్రశేఖర్

ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అక్కడి నుంచి రాఘవేంద్ర కాలనీ వరకు నిర్వహించిన చేనేత ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం ద్వారా చేనేత ప్రాముఖ్యత దేశవ్యాప్తంగా చాటిచెప్పబడిందని, అదే స్ఫూర్తితో ప్రతి ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, బ్యాంకు రుణాలు, పెన్షన్లు వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్ఫూర్తిగా తీసుకుని చేనేత రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి వెంకటేశం, గంజి మురళి, రాపోలు దత్త గణేష్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు పి. సత్యనారాయణ, కర్నాటి యాదగిరి, పవర్‌లూమ్స్ జిల్లా ఓనర్ల సంఘం అధ్యక్షుడు చేరుపల్లి శ్రీనివాస్, చేనేత కళాకారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రకృతిని నేసిన కళకు జాతీయ గుర్తింపు

### చౌటుప్పల్ కళాకారుడికి జాతీయ చేనేత పురస్కారం

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కళాకారుడు గంజి వెంకటేశ్**



**చౌటుప్పల్, ఆగస్టు 7 (జనం సాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు గంజి వెంకటేశ్ దేశ అత్యున్నత చేనేత గౌరవాల్లో ఒకటైన జాతీయ చేనేత పురస్కారం?2025ను శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ప్రకృతి అందాలు, జీవవైవిధ్యాన్ని ఇక్కత్ నేయు కళ ద్వారా అపూర్వంగా ప్రతిబింబించిన ఆయన సృజనకు గుర్తింపుగా ఈ జాతీయ పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా ఎంపికైన అత్యుత్తమ చేనేత కళాకారుల్లో ఒకరిగా వెంకటేశ్ నిలిచారు.పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన వెంకటేశ్ తన తండ్రి గంజి భిక్షపతి వద్ద చేనేత కళను అభ్యసించి, గత 34 సంవత్సరాలుగా ఈ సంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచ ప్రఖ్యాత ఇక్కత్ పద్ధతిలో ఆవిష్కరించాలని సంకల్పించిన ఆయన, ఈ ప్రత్యేక పట్టు చీరను రూపొందించేందుకు 15 నెలల పాటు నిరంతర శ్రమించారు. మొదటి ఆరు నెలలు గ్రాఫ్ పేపర్‌పై అత్యంత సూక్ష్మంగా డిజైన్ రూపొందించారు. అనంతరం ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా టీ పొడి, కొత్తిమీర, పుదీనా, కాచు, మంజిష్ఠ వంటి సహజ పదార్థాలతో రంగులను తయారు చేశారు. టై అండ్ డై విధానంలో మల్బరీ పట్టుదారానికి రంగులు అద్దేందుకు ఎనిమిది నెలలు కేటాయించి, చివరగా నెల రోజుల పాటు మగ్గంపై ఒక్కో పోగును ఓర్పుతో అల్లుతూ అద్భుత కళాఖండాన్ని సృష్టించారు. ఈ ప్రత్యేక పట్టు చీరపై ఇళ్లు, గుర్రాలు, బాతులు, కుందేళ్లు, నీటి గుర్రం, చేపలు, పడవ, సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షులు వంటి ప్రకృతి జీవవైవిధ్యాన్ని కళాత్మకంగా ప్రతిబింబించి తన ప్రతిభను కనబరిచి జాతీయ చేనేత పురస్కారం అందుకున్నారు.

## విద్యే ఆదివాసీ సమాజ అభ్యున్నతికి బలమైన ఆయుధం

**-విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**పి.ఏ.పల్లి,ఆగస్టు 07(జనంసాక్షి )**

ఆదివాసీలు ప్రకృతిని ఆరాధిస్తూ తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను వేల ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న గొప్ప సమాజమని, వారి చరిత్రను, వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడమే ఇతిహాస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల పరిధిలోని మైనంపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళల)లో నిర్వహించిన "ఇతిహాస్"× కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ప్రకృతితో వారి అనుబంధాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సందర్భమని అన్నారు. తెలంగాణలో లంబాడ (బంజారా), గోండు, , తోటి,పర్ధాన్, ఆంధ్,కోంద్,ఎరుకల,సవర (సౌర), గదబ తదితర అనేక గిరిజన తెగలు తమ ప్రత్యేక జీవన విధానాలతో రాష్ట్ర సాంస్కృతిక ఎప్రత్యేక జీవన విధానాలతో రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి తెగకు ప్రత్యేకమైన భాష,వేషధారణ, ఆచారాలు,జానపద కళలు,సంప్రదాయాలు, పండుగలు,నృత్యాలు,సంగీతం ఉన్నాయని,అదే మన రాష్ట్ర సాంస్కృతిక సంపదకు గొప్ప గుర్తింపు అని అన్నారు.ఆదివాసీలు ప్రకృతిని దేవతగా భావించి అడవులు,కొండలు,నదులను పరిరక్షిస్తూ ప్రకృతితో మమేకమై జీవించే గొప్ప జీవన తత్వాన్ని ప్రపంచానికి అందించారని ఎమ్మెల్యే కొనియాడారు.నేటి తరానికి ఆదివాసీల జీవన విలువలు, ప్రకృతి పరిరక్షణ పట్ల వారి బాధ్యత, సామాజిక ఐక్యత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యే ఆదివాసీ సమాజాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తివంతమైన ఆయుధమని అన్నారు.ఆదివాసీ విద్యార్థులు తమ పూర్వీకుల గొప్ప చరిత్ర, సంస్కృతిని గౌరవిస్తూ ఆధునిక విద్యలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యా అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని తెలిపారు.కటరీ వేణుగోపాల్ రెడ్డి,ఆర్ సి ఓ శ్రీనివాస రాయ్, ప్రిన్సిపాల్ హరిప్రియ,మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో ముందస్తు బోనాల వేడుకలు

**చింతపల్లి , ఆగష్టు 07( జనం సాక్షి )**

తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన బోనాల పండుగను బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లోముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలో నృత్యాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.
పాఠశాల ప్రిన్సిపల్ ఆనంద కిరిటి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బోనాల పండుగ విశిష్టతను చాటిచెప్పారు. తెలంగాణ సంస్కృతిని విద్యార్థులకు పరిచయం చేయడానికి పాఠశాలల్లో ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. పాఠశాలల్లో బోనాల వంటి సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తారు..



# సూర్యాపేటకు రైలు వచ్చే వరకు పోరాటం ఆగదు

## రైల్వే సాధన సమితి ర్యాలీకి విశేష స్పందన



**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలన్న ఆకాంక్ష విద్యార్థుల నినాదాలతో మరోసారి మార్మోగింది.రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల భారీ ర్యాలీ విజయవంతంగా సాగింది.వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్ఐసీ ఆఫీస్ వద్ద ప్రముఖ విద్యావేత్త, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్‌రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అనంతరంరైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి శివకుమార్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, రైల్వే సాధన సమితి కో కన్వీనర్లు డాక్టర్ రమేష్ చంద్ర, రాచూరి ప్రతాప్, తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.రామ్మూర్తి, రైల్వే సాధన సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.రంగారెడ్డి, యామా ప్రభాకర్, కొత్తపల్లి రేణుక, టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, ప్రముఖ విద్యావేత్త తీకుళ్ల సాయిరెడ్డి, చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్లారెడ్డి తదితరులు ప్రసంగించారు. సూర్యాపేటకు రైలు రావడం ఈ ప్రాంత ప్రజల న్యాయమైన హక్కని అన్నారు. గతంలో సూర్యాపేట మీదుగా ప్రతిపాదించిన రైల్వే మార్గాన్ని దారి మళ్లించడం ఈ ప్రాంత ప్రజలను మోసగించడమేనని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలక ప్రాంతంగా ఉన్న సూర్యాపేటను ఇప్పటికీ రైల్వే లైన్‌కు దూరంగా ఉంచడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు.దేశ రైల్వే అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలకు తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేట ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ గుర్తించి తక్షణమే రైల్వే లైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రైల్వే లైన్ సాధించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని, రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. రైల్వే సాధన ఉద్యమాన్ని ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం చేయకుండా రాజకీయాలకు అతీతమైన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.రాజకీయ పార్టీల సహకారం, పౌర సమాజం క్రియాశీల భాగస్వామ్యం, విద్యార్థులు యువత మద్దతుతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు, న్యాయవాది అయోధ్య, వెంకట్ యాదవ్, కె.మంజుల, అక్కినపల్లి రాము, సముద్రాల రాంబాబు, మారోజు కృష్ణమూర్తి, అఖిల్, సింహాద్రి,పిడిమర్తి ఉమేష్, దంతాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం

**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో శుక్రవారం ఆడికృతిక పర్వదినం సందర్భంగా శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు.దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ కుమార్ శర్మ, దాములూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసంలో కృతిక నక్షత్రం వచ్చే రోజున ఆడికృతిక అంటారని, ఇది స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.ఈ రోజున స్వామిని పూజిస్తే అన్ని విధాల శుభం కలుగుతుందని తెలిపారు.ఈ వేడుకలలో భాగంగా పాల కావడి, 54 ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.చల్లా లక్ష్మీకాంత్ శృతి దంపతుల అభిషేకం, కళ్యాణంకు,మడిపెద్ది యాకయ్య అన్నదాన కార్యక్రమానికి సహకరించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య,అనంతుల సూర్యనారాయణ, అనంతుల శ్రీనివాస్, అనంతుల దుర్గాప్రసాద్, పెద్దిరెడ్డి భరత్,వాసా కృష్ణ, చెన్నూరి వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అర్చకులు దుర్గాప్రసాద్ శర్మ, సుబ్రహ్మణ్య సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ పండుగను ఘనంగా నిర్వహించాలి

## పాండు నాయక్

**హాలియా, ఆగస్టు 7 (జనం సాక్షి):**
హాలియాలో ఈ నెల 9న నిర్వహించనున్న తీజ్ పండుగను విజయవంతం చేయాలని తీజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సపావత్ పాండు నాయక్ పిలుపునిచ్చారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే ఈ వేడుకలో బంజారా సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఆదివారం ఉదయం 10 గంటలకు హాలియా పట్టణంలో నిర్వహించే ఉత్సవంలో పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బంజారా సమాజం ఐక్యత, అభివృద్ధితో పాటు కుటుంబాల్లో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



## హుజూర్‌నగర్ ప్రభుత్వ ఐటిఐ/ఏటిసిలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

### ఆగస్టు 6 నుండి 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హుజూర్‌నగర్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**



హుజూర్‌నగర్ ప్రభుత్వ ఐటిఐ/ఏటిసిలో రెండో విడత ప్రవేశాలకు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి ఆగస్టు 15 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని ఆయన సూచించారు. ఎస్ఎస్సి మెమో, టీ సీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు లతో http://www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా, సొంత మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడితో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.మొదటి విడతలో సీటు రాని అభ్యర్థులు కూడా మళ్లీ తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు **8247506920, 84990 84414, 9160284139, 8247443682** నంబర్లను సంప్రదించాలన్నారు.



పెసర ఆయిల్ ఫామ్ పంటల క్షేత్ర పరిశీలన

## రైతులకు సబ్సిడీపై పెసర కంది విత్తనాలు

### వ్యవసాయ అధికారి సైదా నాయక్

**నూతనకల్ ఆగస్టు 7(జనంసాక్షి)**
మండల వ్యవసాయ అధికారి ధీరావత్ సైదా నాయక్ ఏ ఈ ఓ ల బృందం శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా ఆరుతడి పంటలు పరిశీలించారు. నూతనకల్ మండలంలో ఎర్రపహాడ్ గ్రామంలోని వ్యవసాయ రైతు కొండ్ర వెంకట్రెడ్డి పెసర మరియు ఆయిల్ పామ్ తోటలను సందర్శించి పరిశీలించారు. ప్రస్తుతము పెసర పంట పూత మరియు పిందే దశలో ఉన్నది పెసర నందు ఆకు మచ్చ తెగులు బూడిద తెగులు మరియు పల్లాకు తెగులు గుర్తించడం జరిగింది దాని నివారణకు కార్బన్డిజమ్ మ్యాంకోజెబ్ ఒక లీటర్ నీటికీ 3 గ్రాములు బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు పల్లాకు తెగులు అనేది తెల్ల దోమ కారణంగా వైరస్ అనే తెగులు వ్యాపించడం జరుగుతుంది దీని నివారణకు తయా మితగ్జామ్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ చొప్పున ఒక లీటర్ నీటిలో కలిపి చేను మొత్తం పిచికారి చేయాలి అని ఏవో తెలిపినారు.ప్రస్తుతము ఎల్ ని నో ప్రభావం చేత తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన వర్షపాతం లేని కారణంగా రైతులు అందరూ వరి పంట సాగును తగ్గించి వర్షాధార పంటలు పెసర, కంది ,మినుములు, మొక్కజొన్న, వేరుశనగ జొన్నలు, సజ్జలు మొదలైన పంటలను సాగు చేయాలని, సబ్సిడీపై కంది, పెసర విత్తనాలు రైతు వేదికలలో అందుబాటులో ఉన్నవి. కంది 4 కేజీల బ్యాగు రు.400, పెసళ్లు 4 కేజీల బ్యాగు రు.304 కావలసిన రైతులు వినియోగించుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ లు జానయ్య,సాయి ప్రసాద్,పావని, సంధ్య,రైతులు కొండ్ర వెంకట్రెడ్డి వినోద, సురేష్, మల్లయ్య పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



**సూర్యాపేట(జనంసాక్షి):**
వినియోగదారుల మన్ననలు పొందేలా నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీమార్ట్ సమీపంలో వాఫిల్ విజ్ వారి నూతన బ్రాంచ్ ను ప్రారంభించి మాట్లాడారు.పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే వాఫిల్స్, బ్రౌనీస్, పాన్‌కేక్స్, కేక్ బౌల్స్ వంటి రుచికరమైన ఆహార పదార్థాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వినియోగదారుల మన్ననలు పొందుతూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారుక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్,నాయకులు అబ్దుల్ రహీం, చింతమల్ల రమేష్,మొరిశెట్టి లక్షాధి, గుణగంటి సతీష్, ఆలేటి మాణిక్యం, నరేందర్ నాయుడు,డాక్టర్ ఆస్వాక్ హుస్సేన్, నిర్వాహకులు ఆసిఫ్, అబ్దుల్ సలాం, ముస్తఫా, సోహెల్, నిహాల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

**జనంసాక్షి ఎఫెక్ట్**

# జనం సాక్షి వరుస కథనాల ఫలితం..!

## చందంపేట ఏపీఎంపై సస్పెన్షన్ వేటు

**ఎన్‌హెచ్‌సీ సెంటర్ అవకతవకలు, జీతాల గోల్‌మాల్, ప్రభుత్వ నిధుల దుర్వినియోగ ఆరోపణలపై చర్య**

**నిజాలను వెలికితీసిన జనం సాక్షి కథనాలు**

చందంపేట ఆగస్టు 07 (జనంసాక్షి) చందంపేట మండలంలోని పోలేపల్లి ఎన్‌హెచ్‌సీ సెంటర్‌లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలు, జీతాల చెల్లింపుల్లో గోల్‌మాల్, ఒకే వ్యక్తికి రెండు


జనంసాక్షి ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం - నల్లగొండ - సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి 23 జూలై 2026 11

వెలుగు కార్యాలయంలో అక్రమాలపై విచారణ నివేదిక ఆలస్యం ఎందుకు..!


పోలేపల్లి న్యూట్రిషన్ హెల్త్ సెంటర్ లో జీతాల గోల్‌మాల్..?


10 01 జూలై 2026 ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం - నల్లగొండ - సూర్యాపేట యాద్రాద్రి భు

విచారణ చేసే అధికారులు ఎక్కడ?

ప్రభుత్వ శాఖల నుంచి వేతనాలు చెల్లించినట్లు వచ్చిన ఆరోపణలు, ప్రభుత్వ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలపై జనం సాక్షి వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాల అనంతరం ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా సంబంధిత చందంపేట మండల వెలుగు ప్రాజెక్టు మేనేజర్ ఏపీఎం జయ ప్రసాద్ ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. , ఎన్‌హెచ్‌సీ సెంటర్ లో పోలేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ విధులు నిర్వహిస్తున్న ఆమెకు చెల్లించాల్సిన వేతనాలు అవకతవకలు జరిగాయని జిల్లా కలెక్టర్ డిఆర్డిఏ పిడి కి ఫిర్యాదులు అందాయి. ఈ వ్యవహారాల్లో వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రజా ధనం వినియోగంలో పారదర్శకత ఉండాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వరుస కథనాల ద్వారా అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన జనం సాక్షి పాత్రపై పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# సేంద్రియ సాగుకు మునుగోడును చిరునామాగా మార్చాలి



నియోజకవర్గంలో సేంద్రియ వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించి, సేంద్రియ సాగుకు మునుగోడును ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.చండూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై అధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు.ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖలపై జరిగిన చర్చలో ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు కలిగే పెట్టుబడి, ఆదాయం, లాభాల వివరాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు చేసే ప్రాంతంగా మునుగోడును తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రజలు తీసుకుంటున్న ఆహారం కల్తీతో నిండిపోతోందని, “ఆహారమే ఔషధంగా మారాలంటే సేంద్రియ వ్యవసాయం అవసరం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం అంటేనే మునుగోడు నియోజకవర్గం గుర్తుకు వచ్చేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రతి గ్రామం నుంచి నిజాయితీగా, నిబద్ధతతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ఎంపిక చేసి, వారి ద్వారా ఇతర రైతులను కూడా సేంద్రియ సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు.సేంద్రియ పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో మునుగోడు నియోజకవర్గంలో పండించే సేంద్రియ పంటలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చండూరు మండలంలోని వివిధ శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

## ఈ నెల 10 వ తేదీన విజయవిహార్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాక..

వరుణ యాగం స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ బి చంద్రశేఖర్‌యాగశాల, ప్రవచన మండపం, టెంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, భారీ బ్యారికేడింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యాగానికి విచ్చేసే ఋత్విక్కులు, అర్చకులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున బందోబస్తు, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. యాగం జరిగే ప్రాంతానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. విజయవిహార్ పరిసరాలను పూర్తిగా పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్, జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్, డీఎస్పీ రవి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ గా కె.లత బాధ్యతల స్వీకరణ



సూర్యాపేట(జనంసాక్షి): జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్న కె.లత జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ గా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు జిల్లా కలెక్టర్ హరిసింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.?గతంలో కూడా ఆమె సూర్యాపేట జిల్లా డిఎస్సిడిఓగా పూర్తిస్థాయి బాధ్యతలను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు మరొకసారి ఆమె ఈ బాధ్యతలను చేపడుతుండటం పట్ల అధికారులు, సిబ్బంది, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# చండూరులో ఉపాధి ఉద్యోగుల 'పెన్ డౌన్' నిరసన

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి..

చండూరు, ఆగస్టు 07 (జనంసాక్షి) కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం స్థానంలో నూతనంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' (వీబీ జీ-రామ్ జీ) పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై నిరసన బాట పట్టారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చండూరు మండలం పరిధిలోని ఉద్యోగులంతా గురువారం 'పెన్ డౌన్' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకు పెన్ డౌన్, షట్‌డౌన్ నిరసనలు అలాగే సమ్మె కార్యక్రమాలు కొనసాగుతాయని ఉద్యోగులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ అమలు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బేసిక్ వేతన శ్రేణిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగంలోని ఇతర సంస్థల ఉద్యోగులతో సమానంగా తమకు కూడా సమాన వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే గత మూడు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను తక్షణమే విడుదల చేసి, గతంలో ఇంద్రవెల్లి సభలో మంత్రి సీతక్క ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చండూరు మండల పరిధిలోని ఉపాధి హామీ పథక ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సైన్స్ కిట్స్ సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి
- విద్యార్థుల ఆవిష్కరణలకు అండగా నిలుస్తున్న యాక్షన్ ఎయిడ్
- మూటకొండూరు జెడ్పీహెచ్ఎస్‌లో స్టెమ్ ల్యాబ్ కిట్స్ పంపిణీ
- కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఇర్ఫాన్, ఎంఈఓ రఘురామ్ రెడ్డి




మూటకొండూరు, ఆగస్టు 07(జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాలపై పట్టు సాధించి, నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మూటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'స్టెమ్ ల్యాబ్ సైన్స్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**ప్రయోగాలతోనే సైన్స్‌పై అవగాహన: డాక్టర్ ఇర్ఫాన్**

ఈ సందర్భంగా డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్ అనుభవం చాలా అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు యాక్షన్ ఎయిడ్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సంస్థ అందించిన సైన్స్ కిట్స్‌లోని సామాగ్రిని ఉపయోగించి పాఠశాల విద్యార్థులు చేసిన వివిధ శాస్త్రీయ ప్రయోగాలు ఎంతో అద్భుతంగా ఉన్నా యని ఆయన ప్రశంసించారు. ప్రతి విద్యార్థి ఈ కిట్స్ సామాగ్రిని సద్వి నియోగం చేసుకుని భవిష్యత్తులో ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.




**యాక్షన్ ఎయిడ్ కృషి అభినందనీయం: ఎంఈఓ రఘురామ్ రెడ్డి.**

మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేందుకు యాక్షన్ ఎయిడ్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలను ఎంపిక చేసుకుని విలువైన సైన్స్ కిట్స్ అందజేసినందుకు సంస్థ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు ప్రయోగాల ద్వారా పాఠాలను బోధించి, వారి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచా లని సూచించారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ జిల్లా కో-ఆర్డినేటర్ సురపంగ శివలింగం సమన్వయకర్తగా వ్యవహరించగా, సంస్థ ప్రతినిధి ఫణీంద్ర విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజా గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాగ్యశ్రీ, విశ్వరూపం, రాజశేఖర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం

సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, వెనుకబడిన వార్డులపై దృష్టి పెట్టి సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 25వ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల ద్వారా మంజూరైన ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ డ్రైన్ కల్వర్టుల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిరుపేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. సమగ్ర నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దారిద్ర రేఖ దిగువన ఉన్న పేదలకు ఒక కోటి 5 లక్షల రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వార్డ్ కౌన్సిలర్ కోడి శిరీష శివ, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, కొణతం రాజేష్ రెడ్డి, పాలగాని మాధవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, మాజీ కౌన్సిలర్ వల్దాసు దేవేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, పడిదల రవి, యాట వెంకన్న, ఖమ్మంపాటి మధుకర్, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి నివారణ



సూర్యాపేట (జనంసాక్షి): అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ రామావత్ సైదా నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో డిస్టిక్ లెవెల్ వన్డే రెడ్ రిబ్బన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి నిర్మూలనపై విస్తృత ప్రచారం జరగాలని, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మారం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎర్రరిబ్బన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మాదకద్రవ్యా వాడకం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి.వెంకటేషులు మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు కర్నాటి కిషన్, వక్త భవాని, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఆర్ శాస్త్రి, ప్రోగ్రాం ఆఫీసర్లు మధుసూదన్, సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఫెరల్ ఇన్ఫినిటీ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

హుజూర్‌నగర్, ఆగస్టు 7 (జనంసాక్షి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను హుజూర్ నగర్ పట్టణంలో ఫెరల్ ఇన్ఫినిటీ స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు సమర్పించారు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బోనాల పండుగ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. "తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం" అని పాఠశాల యాజ మాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్. ఓ. డిసి ప్రకాష్, ప్రిన్సిపాల్ కె.ఎ జోమి, వైస్ ప్రిన్సిపాల్ అజయ్, ఉపాధ్యా యునీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల

# వినియోగ దారుల పై పెనుభారం

### మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య



తుంగతుర్తి ఆగస్టు 7 (జనం సాక్షి) కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అమెరికా ఇరాన్ యుద్ధం పేరుతో పెట్రోల్ లో 20%ఇతనాల్ కలిపిన పెట్రోల్ అమ్మడం వలన వినియోగ దారులపై ఆర్థిక భారం పడుతుందని మాజీ ఎంపీపీ తాడికొండ సీతయ్య అన్నారు శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు ఇథనాల్ అనేది చెరకు. మొక్కజొన్న బియ్యం లాంటి పదార్థాల నుండి తయారుగుతున్నందున నీటి శాతం ఎక్కువగా ఉండడం వలన సాధారణ పెట్రోల్ కన్నా ఇతనాల్ కలపడం వలన మైలేజీ 10%తగ్గుతుందని అన్నారు. బండి సర్వీస్ కూడ తగ్గి పోతన్నందున మెయింటేనేన్స్ భారం వినియోగదారులపై పెరుగుతుందని అన్నారు, కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల ఇష్టం మేరకు వాడుకునే విధంగా. ఇతనాల్ కలపని పెట్రోల్ కూడ సప్లేయి చేయాలని డిమాండ్ చేశారు, కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తామనిచెప్పి మూడవసారి అధికారం లోకి వచ్చి నిత్యావసరవస్తువులైన గ్యాస్. ధరను పెంచి పేద మధ్య తరగతి కుటుంబాల పై ఆర్థిక భారాన్ని మోపిందని అలాగే రైతులపై భారం పడి వ్యవసాయం కుంటు పడే విధంగా కాంప్లెక్స్ ఎరువులపై అధిక ధరలను పెంచిందని విమర్శించారు, కనీసం యూరియా, డిఎపి దొరికే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులకు గురోతున్నారని అన్నారు. ఒక పక్క రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేఖ విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పాల్గొన్నారు, ప్రజలు. రైతులు. రానున్న రోజుల్లో కాంగ్రెస్. బిజెపి పార్టీలకు ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు

# గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం మన లక్ష్యం:సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్

## చెత్తబుట్టల వినియోగంపై ప్రజలకు అవగాహన




రామన్నపేట, ఆగస్టు 7 (జనంసాక్షి): గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోగారం గ్రామపంచాయతీ ఆవరణలో నాలుగు రకాల చెత్త బుట్టల వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు చెత్తను వేరు చేసి, సరైన చెత్తబుట్టల్లో వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త తదితర వ్యర్థాలను వేరు చేయడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యకరంగా ఉంచుకోవచ్చని గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు మెంబర్లు నేరటి మానస సురేష్ యాదవ్, మేడి ఆంజనేయులు, కనుక మల్లేష్, చిరగోని శిల్పా, నవీన్ యాదవ్, వనం అండాలు యాదగిరి గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, సంఘబంధం అధ్యక్షురాలు పబ్బు జ్యోతి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదే హేమలత, వివోఏ భోగ సంధ్య, కూనూరు మహేష్ గౌడ్, బైకాని మహేష్ యాదవ్, మేడి కృష్ణ, మేడి ముఖేష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అటవీ సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి:జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట (జనంసాక్షి):** అడవులను నాశనం చేయవద్దని, అడవులు పెరిగితేనే కరవు లాంటి తీవ్ర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించవచ్చని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో ఆయన ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అటవీ భూముల అక్రమ ఆక్రమణలను గట్టిగా నిరోధించాలని ఆదేశించారు.ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా, లేదా పోడు భూములకు సంబంధించి ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు జరిగే అవకాశం ఉన్నా ఫారెస్ట్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పోలీసుల సహకారం తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అడవుల విషయంలో తరచూ సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి, వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.ఉభయ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అడవులను రక్షించాలని పిలుపునిచ్చారు. ఫారెస్ట్, పోలీస్ పరిధిలో నమోదైన పాత కేసులన్నింటినీ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి దామోదర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మినారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఆదిత్య, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలే టార్గెట్.. హుండీ చోరీల నిందితుడు అరెస్ట్

హాలియా, ఆగస్టు 7 (జనం సాక్షి):
హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల జరిగిన హుండీ చోరీ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో పాటు సీసీటీవీ ఫుటేజీలు, క్లూస్ టీం సేకరించిన ఆనవాళ్లు, ఇతర సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించినట్లు హాలియా ఎస్సై బి. సాయి ప్రశాంత్ తెలిపారు.
ఎస్సై వివరాల ప్రకారం.. అనుముల గ్రామ సమీపంలోని ద్వారకాపురి ఆర్చ్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న దేవరకొండకు చెందిన గంజి వెంకటేష్ (33)ను అదుపులోకి తీసుకుని విచారించగా, దేవాలయంలో హుండీ చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఈ కేసుకు సంబంధించిన రూ.1,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.
విచారణలో నిందితుడు మద్యం సేవించడం, వ్యక్తిగత అవసరాల కోసం డబ్బు సమకూర్చుకునేందుకు దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని హుండీ చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందని ఎస్సై తెలిపారు. ప్రస్తుత కేసుతో కలిపి మొత్తం ఐదు ఆస్తి నేరాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.
నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై బి. సాయి ప్రశాంత్ తెలిపారు.
ఈ కేసును వేగంగా ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన పోలీసు సిబ్బంది పీసీలు కొప్పర వెంకన్న, ఏజాజ్లను సీఐ రాఘవరావు అభినందించినట్లు ఎస్సై వెల్లడించారు.




**దేవాలయాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి...**

ఈ సందర్భంగా ఎస్సై బి. సాయి ప్రశాంత్ మాట్లాడుతూ, దేవాలయాల్లో సీసీ కెమెరాలు, హుండీలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీలకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల సహకారంతో ఇటువంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని తెలిపారు.



# ఆగస్టు 15లోపు పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలి
## టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

చింతపల్లి, ఆగస్టు 07(జనంసాక్షి)
చింతపల్లి మండలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యుఎస్ పిసి పిలుపు మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆదర్శ పాఠశాలలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ మాట్లాడుతూ, ఆగస్టు 15లోపు పీఆర్సీ నివేదిక ప్రకటించి 01 నుంచి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు.
విద్యాశాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని, రేషనలైజేషన్ జీఓ-25ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో, ఆగస్టు 29న రాష్ట్ర స్థాయిలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కాశిరెడ్డి కృష్ణారెడ్డి, కోట్ల యాదగిరి చింతపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిలువేరు నారాయణ, ముసుగు ఆనంద్ బాబు, కోశాధికారి ఇరిగి స్వామి, సీనియర్ నాయకులు ఎర్ర శ్రీరాములు, దొడ్డి నరసింహ, నాంపల్లి మండల అధ్యక్షుడు, జింకల సత్యనారాయణ, మర్రిగూడ మండల నాయకులు, హనుమంత్ నాయక్, పోలే కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**గుర్రంపోడు, ఆగస్టు 7 (జనంసాక్షి)**



గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద నిరుద్యోగ యువతీ యువకులకు బుసిరెడ్డి ఫౌండేషన్ శుభవార్త అందించింది. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.నల్గొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న భవిత ఇన్‌స్టిట్యూట్‌లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 16న ఉదయం 10 గంటలకు భవిత ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఈ నెల 19 నుంచి మూడు నెలల పాటు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అర్హులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు **7893262654, 9177668477** నంబర్లను సంప్రదించాలని బుసిరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.

# నల్లగొండలో పగటి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
## రూ.3.25 లక్షల నగదు, స్కూటీ స్వాధీనం.. మరో ఇద్దరి కోసం గాలింపు:

**నల్గొండ, ఆగస్టు 7,(జనం సాక్షి):**
నల్లగొండ పట్టణంలో వరుసగా జరుగుతున్న పగటి పూట చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ (48)ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, ఒక స్కూటీ, చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్లు, మాస్క్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ జి. రమేష్ తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు ఇర్షాద్, షరీఫ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత నెల జూలై 26న నల్లగొండలోని వి.టి. కాలనీలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ దర్యాప్తు చేపట్టాయి.దర్యాప్తులో భాగంగా ఆగస్టు 6 సాయంత్రం నల్లగొండలో మరోసారి చోరీలకు పాల్పడేందుకు స్కూటీపై వస్తున్న మహమ్మద్ నసీమ్‌ను పానగల్ బైపాస్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నల్లగొండతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన పలు చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ముఠా ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లను గుర్తించి కొంతసేపు రెక్కీ నిర్వహించేది. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత పగటి సమయంలో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారం, నగదు దోచుకుని వెంటనే పరారయ్యేదని దర్యాప్తులో తేలింది.నల్లగొండలో రెండు ఇళ్లతో పాటు వి.టి. కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో చోరీలు చేసినట్లు, అలాగే నెల్లూరు, తిరుచానూరు ప్రాంతాల్లో నమోదైన భారీ చోరీ కేసుల్లో కూడా ఈ ముఠా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ గతంలో ఢిల్లీ, ఇండోర్, మీరట్ ప్రాంతాల్లో పలు చోరీ కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు.హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా వరుస చోరీలకు పాల్పడి చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించిన అతడు, ఇటీవల అత్తాపూర్‌లో నివాసం ఉంటూ మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.నిందితుడి వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, డీఎల్-5ఎస్-డీఎస్-1374 నంబర్ స్కూటీ, రెండు ఇనుప రాడ్లు, ఒక మాస్క్, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు నగదు రికవరీ చేసిన నల్లగొండ వన్ టౌన్, టూ టౌన్ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

